

# గురువు

## గురువుతో అనుబంధం ఎలా ఏర్పడుతుంది?

భక్తుడు:

గురువుగారూ! “నా భక్తులను నేనే ఎన్నుకొంటాను” అన్నారు కదా బాబా. మరి ఇలా ఎన్నుకోవడమనేది ఆ భక్తుడు పుట్టినప్పుడే నిర్ణయమైపోయివుంటుందా లేక ఆ భక్తుని జీవితకాలంలో నిర్ణయమవుతుందా? ఉదాహరణకు నా విషయమే తీసుకుంటే 1998 వరకు నాకు బాబా ఎవరో, ఏమిటో తెలియదు; బాబా నన్ను 1998లో ఎన్నుకొన్నారా లేక అంతకుముందే ఎన్నుకొన్నారా? నాకు బాబా అనుగ్రహం ఎప్పుడూ ఉందా? అంటే బాబా గురించి నాకు తెలియకముందు నుంచీ నాకు బాబా అనుగ్రహముందా? లేక నేను ఆయన దగ్గరకు వచ్చిన తర్వాతనే ఉందా?

గురువుగారు:

మీకు బాబా గురించి ఇప్పుడు తెలుసు, కానీ ఆయనకు మీ గురించి ఎప్పటి నుంచో తెలుసు. ఈ విషయాన్ని ఎన్నోసార్లు ఆయన స్పష్టంగా తెలియజేశారు. భక్తులకు ఆయన గురించి యీ జీవితకాలంలోనే తెలిసినప్పటికీ వాళ్ళ గురించి ఆయనకు చాలా జన్మల నుండీ తెలుసునని ఆయన చెప్పారు. మీకు బాబా గురించి ఇప్పుడు తెలుసు, కానీ ఆయనకు మీ గురించి చాలా ముందు నుండీ తెలుసు. అది ఎన్ని జన్మలనేది మనకు తెలియదు.

భక్తుడు:

మరి అలాంటప్పుడు, ఆయనే మన గురువని పుట్టుకతోనే మనకు ఎందుకు తెలియదు?

గురువుగారు:

ఆ సమయం వచ్చినప్పుడు మనకు తెలుస్తుంది. మనకింకా కొన్ని ఆకర్షణలున్నాయి, తీరక తప్పని అవసరాలున్నాయి, రావాల్సిన అనుభవాలు ఉన్నాయి. బాబా మనకు వాటిని ప్రసాదిస్తారు. కొంతమంది విషయంలో యీ జాబితా చాంతాడంత ఉంటుంది. ఆ అవసరాలన్నీ తీరి, అనుభవాలు వచ్చిన తర్వాత వారు బాబా తమ సొంతమని గుర్తిస్తారు. కానీ చిన్నదో, పెద్దదో... మనల్ని ఆయనతో కలిపే ఆ త్రాడు మాత్రం ఉంటుంది.

భక్తుడు:

అంటే నాకు బాబా గురించి తెలియకముందు నుండీ ఆయన అనుగ్రహం ఉంది, నేను బాబా మార్గంలోకి వచ్చిన తరువాతే ఆ విషయం నాకు తెలిసిందంటారా?

గురువుగారు:

అవును. ఆ విషయం మీకు బాబా దగ్గరకు వచ్చిన తరువాతే తెలిసింది. మనం సద్గురువును ఎలా గుర్తిస్తామనే విషయం మాటలకందనిది. అదో రకమైన అనుబంధం, ఆకర్షణ, ఇష్టం. దానికి షరతులు, నిబంధనలూ లేవు. చుట్టూ పైపైన కనిపించే విషయాలవల్ల కాక ఆయన మన గురువని మన హృదయం చెబుతుంది. మనకు ఆ అనుభూతి కలిగిన తరువాత ఆ గురువు మనల్ని స్వీకరించాలని పరితపిస్తాము. కానీ మనం ఆయన దగ్గరకు రాకముందే ఆయన మనల్ని ఎన్నుకొనివున్నారన్న విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. సద్గురువు మనల్ని ఎన్నుకొన్న తరువాతే మనం ఆయన కోసం అన్వేషించి ఆయనను చేరుకోగలము.

తమకున్న ఎన్నో రూపాలలో మనకు తగిన ఫలానా రూపం ద్వారా ఎప్పుడు మనకు తామే గురువని తెలియజేయాలో సద్గురువుకు బాగా తెలుసు. అందుకు వారి మార్గాలు వారికుంటాయి. అంతేగానీ మనకై మనం ఆయనను గుర్తించడం జరగదు. ఆయన గురించి మనకు తెలియకపోయినప్పటికీ ఆయన ప్రభావం మన మీద అప్పటికే ఉంటుంది.

భక్తుడు:

అసలు యీ అనుబంధానికి మూలకారణం ఏమిటి?

గురువుగారు:

ఆ బంధాన్ని ఆయన ఏర్పరచుకొంటారు. అది మనం ఏర్పరచుకొనేది కాదు. ఎలా ఏర్పరచుకొంటారనేది మాత్రం కేవలం ఆయనకు మాత్రమే తెలుసు.

భక్తుడు:

ప్రతి ఒక్కరికీ వారికి తెలిసినా, తెలియకపోయినా గురువంటూ ఉంటారా? గురు సాంప్రదాయం లేని పాశ్చాత్యులకు కూడా గురువుంటారా?

గురువుగారు:

పాశ్చాత్యులకు కూడా గురువు ఉంటారు. ప్రతి ఒక్కరికీ పరిపూర్ణత్వం పొందాలనే అవసరం ఉంది, ప్రపంచంలోని ప్రతి ప్రాణికీ ఆ అవసరం ఉంది, కేవలం భారతీయులకు, పాశ్చాత్యులకు మాత్రమే కాదు, ప్రతి జీవికీ ఉంది. పరిపూర్ణత్వాన్ని కోరుకునే ప్రతి ప్రాణీ ఆ పరిపూర్ణత్వాన్ని ఇచ్చే రూపంతో ఏదో ఒక మార్గంలో అనుసంధానమయ్యే ఉంటుంది.

భక్తుడు:

కాబట్టి యీ ప్రపంచంలో నిజాయితీగా అన్వేషించే ఏ వ్యక్తికీ నిజమైన ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం లేకుండాపోవడమంటూ ఉండదన్నమాట! అంటే దైవం కాకుండా ఆ వ్యక్తి పట్ల ప్రత్యేకమైన బాధ్యత వహించే ఆధ్యాత్మిక అస్తిత్వం (entity) ఉంటుందా?

గురువుగారు:

అది అస్తిత్వం (entities) లాగా ఉండదు. అది ఒక సాపేక్షికమైన పదం. ఒక వ్యక్తిని పరిపూర్ణం చేసే శక్తి మన జీవంలోనే నిబిడీకృతమై ఉంటుంది. ఆ తత్త్వమే సరైన సమయం వచ్చినప్పుడు ఏదో ఒక రూపంలో వ్యక్తమవుతుంది. కానీ అలా ప్రకటమయ్యేది ఆ సూత్రమే. సద్గురువు గురించి మాట్లాడేటప్పుడు నేను 'సద్గురువు' అనే ఆ సూత్రం గురించి మాట్లాడుతున్నాను.

సమస్త ప్రకృతి అనుకూల, ప్రతికూల ఆకర్షణలతో కూడివుంటుంది. ఉదా॥కు భౌతికశాస్త్రాన్ని తీసుకోండి: ప్రతి పదార్థం న్యూట్రాన్, ఎలక్ట్రాన్, పాజిట్రాన్ ఇటువంటి వాటితో నిండివుంటుంది. ఎలక్ట్రాన్ ఎప్పుడూ కేంద్రం వైపుకు లాగబడుతూ న్యూక్లియస్‌తో కలసిపోవాలని ప్రయత్నిస్తూ ఉంటుంది. మనకు తెలిసిన ఏ ఇతర పద్ధతులమీదా మనల్ని ఆధారపడనీయకుండా చేసి, మనకు పరిపూర్ణత్వాన్ని ఇచ్చే సూత్రాన్ని నేను 'సద్గురువు' అంటున్నాను. ప్రతి జీవిలో ఆ శక్తి ఉంది, ఎందుకంటే ప్రతి జీవి ఆ పరిపూర్ణత్వం కోసం పరితపిస్తోంది. ఆ శక్తి ప్రతి జీవిలో సహజసిద్ధంగా ఇమిడివుంది. శరీరం పుట్టుకతోనే అది జీవంలోని భాగంగా ఉంటుంది. సమయం వచ్చినప్పుడు మాత్రమే సద్గురువు రూపంలోనో, మరో రూపంలోనో ప్రకటమవుతుంది. ఎందుకంటే అది ఆ సూత్రం (తత్త్వం) కాబట్టి.

ఎవరైనా దానికోసం సంసిద్ధులైనప్పుడు, వారికి ఆ శక్తి తగినంతగా ఉన్నప్పుడు, ఆ సూత్రమే తనను ఒక నిర్దిష్టమైన (సద్గురు) రూపంలో ప్రకటం చేసుకుంటుంది. అప్పుడు మీరు సద్గురువు వద్దకు వెళతారు. ఆపై క్రమంగా మీకున్న ఇతర ఆకర్షణలు సద్గురువు అనే ఆకర్షణతో కలసిపోతాయి.

"ప్రతి ఒక్కరికీ సద్గురువు ఉంటారు" అని నేను చెప్పినప్పుడు... పరిపూర్ణత్వం కావాలని ప్రతి ఒక్కరిలో ఉండే యీ కోరిక గురించి, ఆర్తి గురించి మాట్లాడుతున్నాను. మనం పరిపూర్ణత్వం సాధించడమనేది ఇంతవరకు మనకు తెలిసినటువంటి, మనకు అలవాటైనటువంటి ఏ ఇతరమైన మార్గాలమీదా ఆధారపడి ఉండదు. ప్రతి ఒక్కరూ ఆ పరిపూర్ణత్వానుభూతినే పొందాలని పరితపిస్తుంటారు. కానీ దానిని పొందలేకపోతుంటారు. కాబట్టి వాళ్ళు రకరకాల మార్గాలను వెతుకుతుంటారు. రకరకాలైన పద్ధతులను ప్రోగుచేసుకుంటారు. ఈ పద్ధతులే పూర్ణత్వమని భ్రమిస్తుంటారు. కానీ ఆ పరితాపం మాత్రం అలాగే ఉంటుంది. ఈ విషయం సిద్ధాంతరీత్యా కొందరికి తెలియవచ్చు, తెలియకపోవచ్చు. కానీ మనకు తెలిసిన మార్గాల మీద ఆధారపడకుండా ఉండాలని, వీటికి అతీతంగా పోవాలనే ప్రయత్నం జరుగుతూనే ఉంటుంది, ఈ అసహాయత అలాగే ఉంటుంది. ఆ కోరికను పరిపూర్ణం చేయగల తత్త్వం, శక్తి కలిగిన నిర్దిష్టమైన రూపాన్ని నేను 'సద్గురువు' అంటున్నాను.

సద్గురువును మనం ఎలా కలుసుకుంటాం?

భక్తుడు:

ఈ సద్గురుతత్త్వం మూర్తీభవించిన రూపాన్ని మనం ఎట్లా కలుసుకుంటాము? సద్గురువు మన జీవితంలోనికి రావడానికి మనం ఆధ్యాత్మికతలో ఒక స్థాయికి చేరుకోవాలా? తీవ్రమైన సాధన చెయ్యాలా? ఇంకా ఏదైనా ప్రత్యేకమైన అర్హతను కలిగివుండాలా?

గురువుగారు:

సద్గురువుకు మన అర్హతలు, మన సాధనాపటిమ లేక మన గొప్పతనం ముఖ్యంకాదు. అది కేవలం ఋణానుబంధం మాత్రమే. అదే ఒక గురువును, మిమ్మల్ని కలుపుతుంది. అంతకుమించి మరేదీ లేదు. అందుకనే బాబా, “నా భక్తులను నేనే ఎన్నుకొంటాను” అన్నారు. ఆయన అనుగ్రహం మన మీద కుండపోతగా వర్షిస్తుంది, అది మనం చేసే సాధన, జపం, ఆత్మవిచారం... ఇలాంటి వాటిని చూసికాదు. ఆయన అనుగ్రహానికి షరతులు లేవు. ఆయనకు, మనకు ఉన్న అనుబంధం వల్ల ఆయన మనల్ని ప్రేమిస్తారు. ఒక తండ్రి బిడ్డను ప్రేమించినట్లు ఆయన మనల్ని ప్రేమిస్తారు. తండ్రి తన బిడ్డను ప్రేమించడానికి ఏ అర్హతలను చూస్తాడు? తండ్రి ప్రేమను పొందడానికి బిడ్డకు ఉన్న అర్హతలేమిటి? ఆ తండ్రికి బిడ్డగా పుట్టడమే అర్హత. అంతే! ఆ అనుబంధం ఒక్కటే దానికి కారణం. బిడ్డ గొప్పగా ఉన్నా, లేకపోయినా తండ్రి పట్టించుకోడు. తన బిడ్డను తాను ప్రేమిస్తాడు. ఇలానే సద్గురువు మనల్ని ప్రేమిస్తారు. మనమంతా ఆయన బిడ్డలం.

భక్తుడు:

గురువుగారూ! సద్గురువుకు, మనకూ మధ్య ఉన్న సంబంధానికి... లేదా మనం సద్గురువు వద్దకు చేరుకోవడానికి కారణం కర్మసంబంధమైన ఋణం అని చెప్పారు. సద్గురువు మనకు ఋణపడ్డారంటే నాకు ఊహించడానికే కష్టంగా ఉంది. మనమే వారికి ఋణగ్రస్తులమై ఉంటామని నేను అనుకున్నాను.

గురువుగారు:

ఋణం ఉండటానికి, ఋణపడి ఉండటానికి తేడా ఉంది. అక్కడ తీర్చవలసిన ఋణం అంటూ ఏమీ లేకపోయినప్పటికీ ఋణపడివున్నామన్న భావన ఉంటుంది. మీరు నాకు ఏదో ఇచ్చారు, నేను దానిని మీకు తిరిగి ఇచ్చేశాను, కానీ మీరు నాకు సాయం చేశారు కాబట్టి నేను మీకు ఋణపడి ఉన్నానన్న భావం ఉంటుంది. అంతేగానీ ఆయన మనకు ఋణం ఉన్నారని కాదు.

భక్తుడు:

కానీ సద్గురువు మనకెలా ఋణపడివుంటారు? అంతగా మేము ఏం చేసివుంటాము?

గురువుగారు:

ఆ విషయం నాకు తెలియదు. మీరు ఎంతో చేసి ఉండవచ్చు. (నవ్వులు...) మనం అంత ఇచ్చివుండకపోయినా, మనమిచ్చినదానికి మించి తిరిగి ఇచ్చేవారే సద్గురువు. బాబా చెప్పింది అదే – "మీరు నాకు ఒక్క రూపాయిస్తే నేను మీకు పదిరూపాయలిస్తాను". ఆయన వడ్డీతో సహా తిరిగి ఇస్తున్నారు, చక్రవడ్డీతో సహా!

ఋణానుబంధం

ఋణం అంటే ఒక రకమైన భావోద్వేగపు అనుబంధమని కూడా అర్థముంది. నేను అప్పు అనే పదం వాడకుండా ఋణపడి ఉండటం, అనుబంధం ఉండటం లేక ఆయనకు చెందినవారమనే భావం ఉండటం అంటాను. అదీ ఋణానుబంధమంటే.

ఒక అనుబంధ భావన, ఒక గుర్తింపు. మనం బాబా మనవారని ఎలా అనుకుంటామో అలాగే మనం ఆయనకు చెందినవారమని ఆయన అనుకుంటారు. దానికో కారణమంటూ ఏమీ లేదు. బాబా, “వీళ్ళు నా మనుషులు, నాకు చెందినవారు, నా పిల్లలు” అనుకుంటారు.

భక్తుడు:

మన పట్ల బాధ్యత ఉన్నట్లుగా ఆయనకు అనిపిస్తుందా?

గురువుగారు:

అవును. మన బాధ్యత ఆయనకు ఉంది. ఆయన మన కోరికలకు, మన ప్రార్థనలకు ఎలా స్పందిస్తున్నారు – ఆ స్పందించే తీరులో ఆ బాధ్యత కనిపిస్తుంది. ప్రతిస్పందిస్తున్నారంటే బాధ్యత అనే కదా అర్థం.

భక్తుడు:

గురువుగారూ! బాబా ప్రతిస్పందనను మరింతగా అనుభూతి చెందడానికి మనం చేయగలిగింది ఏమైనా ఉందా?

గురువుగారు:

దానిని గుర్తించి ఆనందిస్తే చాలు. దానిని గుర్తించడం అంత కష్టమా? కృతజ్ఞత చూపించడం కోసం మనమేదైనా చెయ్యాల్సిన అవసరం ఉందా? మన కోసం ఏదైనా చేసినపుడు, మనం దానిని అభినందించడం సహజంగానే వస్తుంది. ఆ కృతజ్ఞత ఒక సహజమైన ప్రతిస్పందన. అవునా? అది అలా కాకపోతే మనలోనే ఏదో లోపం ఉంది. కృతజ్ఞతగా ఉండటానికి మనం చేయవలసిందేదైనా ఉందా? బాబా ఇచ్చిన దానిని స్వీకరించి, దానిని అనుభూతి చెందండి, కృతజ్ఞత కలిగివుండండి. మన ప్రేమను అనుభూతి చెంది, అభివ్యక్తం చేయడమే నిజమైన కృతజ్ఞత.

# సద్గురు ప్రేమ

భక్తుడు:

గురువుగారూ! సద్గురువుకు తమ భక్తుల పట్ల ఉండే ప్రేమ ఎప్పుడూ అలౌకికమైనదిగానే ఉంటుందా?

గురువుగారు:

అది వ్యక్తిగతమైన ప్రేమ కూడా. అది అతీతమైన ప్రేమ అయినప్పటికీ అది వ్యక్తిగతమైనదిగా, చాలా చాలా వ్యక్తిగతమైనదిగా వ్యక్తమవుతుంది. భక్తుడు వ్యక్తం చేసేదానికన్నా కూడా వ్యక్తిగతమైనది. తమ భక్తుల పట్ల బాబా చూపిన ప్రేమ ఎంత వ్యక్తిగతమైనది! బాబా తమ సన్నిహిత భక్తులలో ఒకరైన తాత్యాకోతేపాటిల్‌ను రక్షించడానికి తమ ప్రాణాలనే అర్పించారని భక్తులు భావించారు. వ్యక్తిగతమైన ప్రేమకు ఇంతకుమించిన ఉదాహరణ ఏమి ఇవ్వగలము?

భక్తుడు:

అది అంత వ్యక్తిగతంగా వ్యక్తమవుతున్నప్పుడు దానిని మీరు వ్యక్తికి అలౌకికమైనదని ఎందుకన్నారు? అందులో వ్యక్తికి అతీతమైనదేముంది? మీరు వ్యక్తిగతమైన ప్రేమ గురించి చెప్పారు. మరి వ్యక్తిగతంకాని ప్రేమ ఏది?

గురువుగారు:

సద్గురువు వద్ద వ్యక్తమయ్యేది కేవలం మామూలుగా వ్యక్తమయ్యే ప్రేమ మాత్రమే కాదు. భక్తుడు వ్యక్తిగతమైన ప్రేమను, అంటే లౌకిక ప్రేమను సద్గురువు వద్ద మాత్రమే కాదు, దానిని అతడు ఇతరుల వద్ద కూడా పొందుతాడు.

కానీ ఇవి రెండూ ఒకటేనా? నేను దానిని కేవలం వ్యక్తిగతమైన (లౌకికమైన) ప్రేమ అని  మాత్రమే అనలేను, ఎందుకంటే అది అక్కడితో ఆగదు. దాని వెనుక ఇంకా ఏదో ఉంది. అది వ్యక్తిగతమైనదైనప్పటికీ అది ఒక వ్యక్తిని తన వ్యక్తిత్వానికి అతీతంగా తీసుకువెళుతుంది.

మూలంలో అది వ్యక్తికి అలౌకికమైనదైనప్పటికీ, అది వ్యక్తమయ్యేటప్పుడు వ్యక్తిగతమైనదిగానే (లౌకికమైనదిగానే) వ్యక్తమవుతుంది. అలా కాకపోతే మీరు ప్రతిరోజూ చూసే రకరకాల లౌకిక ప్రేమల్లాగా అదీ లౌకిక ప్రేమే అవుతుంది.

భక్తుడు:

భక్తుని అవసరాలకు అనుగుణంగానే సద్గురువు ప్రేమ వ్యక్తమవుతుందా?

గురువుగారు:

ఆ అవసరాలు పూర్వకర్మలను అనుసరించి ఉంటాయి, ఆ అవసరాలను బట్టే సద్గురువు యొక్క వ్యక్తీకరణలుంటాయి. దానినే శాస్త్రాలు, 'సంస్కారాలు' అన్నాయి. శిష్యుని సంస్కారాన్ని బట్టి సద్గురువు ప్రేమ వ్యక్తమవుతుంది. ఆ సంస్కారం ఏవిధంగా ఏర్పడింది? పాత ఆలోచనలవల్ల సంస్కారం ఏర్పడుతుంది. సంస్కారాలను అనుసరించే అతని అవసరాలు ఉంటాయి. అతని అవసరాలను బట్టే సద్గురువు యొక్క వ్యక్తీకరణలుంటాయి.

# నేనుండగా భయమేల?

భక్తుడు:

“నేనిక్కడ ఉండగా భయమేల?” అని బాబా చెప్పినప్పుడు అది ఎంతో వ్యక్తిగతమైన మాట, అంటే భరోసా అనిపిస్తుంది.

గురువుగారు:

ఒక భక్తుడు ఓ సందర్భంలో భయపడ్డప్పుడు, “నేనిక్కడ ఉండగా ఎందుకు భయపడతావు?” అన్నారు బాబా. ‘ఇక్కడ’ అనే మాటకు నీవెక్కడ ఉంటే ‘అక్కడ’ అని అర్థం. నేను నీతోనే ఉంటాను అని దానర్థం. నీవెక్కడ ఉంటే అక్కడ నిన్ను రక్షించడానికి బాబా ఉన్నారు. నేను నీతోనే ఉంటాను, ఇదీ దానర్థం. ఈ విషయాన్నే బాబా వేరే వేరే సందర్భాలలో, “నీవెక్కడకు వెళ్ళినా నేనక్కడ ఉన్నాను, నీవెక్కడ చూస్తే నేను అక్కడ ఉన్నాను” అని అన్నారు. మీ చూపు ఎక్కడపడితే అక్కడ బాబా ఉన్నారు. బాబా పలికిన మిగతా మాటలను బట్టి ‘ఇక్కడ’ అంటే ఏమిటో నిర్వచించుకోవాలి.

రమణమహర్షి విషయంలో కూడా ఇది అంతే. మీరు నిజంగా అర్థం చేసుకుంటే, “శ్రీరమణమహర్షి సంభాషణలు” గ్రంథమంతా ‘ఇక్కడ’ అనే పదానికి వ్యాఖ్యానమే. నేను దానిని ఒకటి రెండు మాటలలోనో, అరగంట, గంటలోనో, రెండుగంటల్లోనో చెప్పలేను. ఆయన బోధనలు, జీవితం మొత్తం ఆ మాటకు వ్యాఖ్యానమని మీరు దానిని అలా చూస్తే అర్థమవుతుంది. ఆయన, “నేను ఎక్కడికి పోగలను, నేనిక్కడే ఉన్నాను” అన్నారు. ఆలోచించండి.

భక్తుడు:

సద్గురువు అన్ని చోట్లా ఉంటే, మేము మీ సాన్నిధ్యంలో ఉండటం యొక్క ప్రాముఖ్యత (విలువ) ఏమిటి?

గురువుగారు:

ఇది చాలా మంచి ప్రశ్న. దీని విలువ మీ అవసరం, మీ అనుభవం మీద ఆధారపడి ఉంటుంది. మనకు కొన్ని విషయాలు కూడా చాలా విలువైనవిగా ఉంటాయి. కొన్నింటికి మన దృష్టిలో అంత విలువ ఉండదు. అది ఏదైనా సరే – మీకు ఇక్కడ ఉండటం యొక్క విలువ పట్ల స్పష్టత ఉన్నా, లేకపోయినా, దాని విలువ నాకు తెలుసు. “మీ దగ్గరకు ఎవరు వచ్చినా ఋణానుబంధంతో వస్తారు, మీరు వారిని సగౌరవంగా చూడాలి, మీ దగ్గర ఉన్నదానిని వారితో పంచుకోండి, మీ దగ్గరకు ఎవ్వరు వచ్చినా నేనే వారిని మీ వద్దకు పంపుతాను” అన్నారు బాబా. నేను దానిని అలానే చూస్తాను. ఆయన ‘అతిథి’ అనే పదాన్ని వాడారు. అతిథిని ఇంగ్లీషులో ‘గెస్ట్’ అంటారు. కానీ ఇంగ్లీషులో ‘అతిథి’ అనే అర్థాన్నిచ్చే సరైన పదంలేదు. ఇంగ్లీషు భాషలో గెస్ట్ అంటే ఆహ్వానం మీద, అపాయింట్‌మెంట్ మీద వస్తాడు, కానీ ‘అతిథి’ అంటే పిలవకుండానే, అనుకోకుండా, నిర్ణీత సమయం లేకుండా వస్తాడు. ‘అతిథి’ అంటే నిర్ణీతమైన (తిథి, వార, నక్షత్రాలు) సమయమంటూ లేకపోవడమని అర్థం.

ఈ ‘అతిథి’ అనే సూత్రాన్ని (సాంప్రదాయాన్ని) నేను తు.చ. తప్పకుండా పాటించాలనుకుంటున్నాను. నేను ఎవ్వరికీ అపాయింట్‌మెంట్ ఇవ్వను, నేను ఎవ్వరినీ ఆహ్వానించను. ఎందుకని? దానికి కారణం పొగరు కాదు.

ఒకవేళ నేను ఎవరినన్నా పిలిస్తే అది నా ఇష్టాయిష్టాల మీద ఆధారపడి ఉంటుంది. కానీ బాబా పంపించినపుడు వాళ్ళ బాగోగులు చూసుకోవడమన్నది ఆయన బాధ్యత. అందుకనే మీరు నా వద్దకు వచ్చినప్పుడు మీరు నాకు బాబా గురించి ఆలోచించడానికి అవకాశాన్ని ఇస్తున్నారని భావిస్తాను. నాకు మీరందరూ బాబా ప్రసాదం. నేను బాబా ప్రసాదాన్ని ఎలా చూస్తానో మిమ్మల్ని కూడా అలానే చూస్తాను. నావరకు నేను, మీరు నాకేమవుతారు, దాని విలువేమిటి? అనే విషయంలో చాలా స్పష్టంగా ఉన్నాను. మీరు ఇక్కడ ఉండటం యొక్క విలువేమిటని మీరు ఆలోచించుకోవాలి.

బాబా ఎవరిని పంపుతారో వాళ్ళే ఇక్కడకు వస్తారు. అందుకే నేను ఎవరు వస్తున్నారు, ఎవరు రావడంలేదు, వాళ్ళు ఏం పొందుతున్నారు, ఏం లాభపడుతున్నారు అనే విషయాన్ని పట్టించుకోను. అది నాకు సంబంధించిన విషయం కాదు. "నేను నా వాళ్ళను రకరకాల మిషల మీద నా దగ్గరకు చేర్చుకుంటాను" అన్నారు బాబా. బహుశా ఆయనకు నేను ఒక మిష కావచ్చు.

సద్గురు సాన్నిధ్యంలో

భక్తుడు:

గురువుగారూ! సద్గురువు పాదాల చెంత ఉంటే చాలని, ఇంకేమీ అక్కర్లేదని మీరన్నారు. అయస్కాంతాన్ని అంటిపెట్టుకొని ఉండే ఇనుపముక్కల్లాగా ఉండటమని మీ ఉద్దేశ్యమా? ఆ ఇనుపముక్క ఇక చేయవలసింది అంటూ ఏదీ ఉండదా? భౌతికంగా గురువు సాన్నిధ్యానికి దూరంగా ఉంటూ హృదయంలో గురువును స్మరిస్తూ, ఆయన గురించి ఆలోచిస్తూ ఉండేవారి విషయంలో కూడా ఇది వర్తిస్తుందా?

గురువుగారు:

మనం చేయాల్సిన ప్రయత్నమంతా మనల్ని మనం సద్గురువు క్షేత్రంలో ఉంచుకోవడమే. అది చేస్తే చాలు. భౌతికంగా ఎంత దగ్గరగా ఉండటానికి వీలవుతుందో అంత దగ్గరగా ఉండాలి. కొన్నిసార్లు అది సాధ్యపడుతుంది, కొన్నిసార్లు సాధ్యం కాకపోవచ్చు. దగ్గరగా ఉండాలన్న మన ప్రయత్నం మాత్రం ఉండాలి. ఎంత దగ్గరగా ఉండాలి? ఒక్క అంగుళమా? రెండు అంగుళాలా? మూడు మైళ్ళు? నాలుగు మైళ్ళు? పది మైళ్ళు?... అది ఎంతైనాగానీ ప్రయత్నం మాత్రం ఉండాలి. మనకు ఆ ప్రయత్నం, ఆ కోరిక, ఆ వైపుకు మనస్సు లాగడం ఉన్నంతవరకు మీరు ఆ అయస్కాంత క్షేత్రంలో ఉంటారు. అలా కాని పక్షంలో, “సద్గురు అయస్కాంత క్షేత్రం అంటే ఏమిటి, అది అంతటా ఉంది, అన్ని చోట్లా ఉంది, ఈ విశ్వమంతా ఆయన అయస్కాంతక్షేత్రమే. మనం ఎక్కడున్నా అయస్కాంతక్షేత్రంలోనే ఉంటాం. మనం శిరిడీ దాకా పోవడమెందుకు? నేనిప్పుడు ఆ అయస్కాంతక్షేత్రంలోనే ఉన్నాను కదా, ఇక్కడే ఉండి సంతోషంగా నా పని నేను చేసుకోవచ్చు”... ఇలాంటి మాటలతో మనల్ని మనం మోసం చేసుకోవడానికి, ఆత్మవంచనకు దారితీస్తుంది.

సద్గురు అయస్కాంత క్షేత్రం అంతటా ఉందనే విషయం సిద్ధాంతరీత్యా నిజమే కావచ్చు. కానీ మనకది అనుభవం కావడంలేదు. కారణమేమిటంటే మనం తుప్పు పట్టివున్నాం. మనం కేవలం ఇనుపముక్కలం మాత్రమే కాదు, తుప్పు పట్టిన ఇనుపముక్కలం. మనకు అంత సున్నితత్వం లేదు. కాబట్టి మనం ఆయనకు దగ్గరగా, చేరువగా ఉండాలి. కాబట్టి మనవైపు నుండి మనం ప్రయత్నం చేస్తాము, కొన్నిసార్లు తప్పనిసరి పరిస్థితులలో అది సాధ్యంకాదు. అలా అప్పుడు మనం వెళ్ళాలని చేసే ఆ ప్రయత్నం చాలు. మనస్సు అలా లాగబడుతోందా, లేదా అన్న కోరికే మనం నిజంగా సద్గురు క్షేత్రంలో ఉన్నామా, లేదా అనేదానికి చిహ్నం. ఆ ఆకర్షణ, ఆ కోరిక, ఆ పరితాపం ఉండాలి. అది ఉన్నంత మేరకు మీరు సద్గురువుతో అనుబంధం కలిగివుంటారు. సాన్నిధ్యం అంటే ఇక్కడ ఇలా దగ్గరగా కూర్చోవడం అని అనుకున్నట్లయితే మీరు అసలు విషయాన్ని మర్చిపోయినట్లే. బాబా చెప్పింది కూడా అదే, “ఎవరైతే నన్ను అయిదున్నర అడుగుల రూపం అని భావిస్తారో వారు నన్నసలు గుర్తించనట్లే” అన్నారు. మనకు ఆయన సాన్నిధ్యాన్నిచ్చే ఆ సన్నిధిలో ఉండాలన్నది మన కోరిక. మనం దానిని పొందుతామా, లేదా అన్నది వేరే విషయం. మనం ఆ ప్రత్యక్ష సాన్నిధ్యంలో ఉంటే మాత్రం ఆ ఫలితాన్ని పొందుతాము.

భక్తుడు:

గురువుగారూ! మాకు మేలు జరుగుతుందని, మాలో మార్పు తెస్తుందని తెలియడం వలన మేము సద్గురుదృష్టిలో ఉండాలి అనుకున్నామనుకోండి. మా ప్రశ్నేమిటంటే, ఋణానుబంధం ఉంటే మేము సద్గురువు దృష్టిలో ఉన్నట్లా? లేకపోతే సద్గురువు చూపు మాపై పడేలా ఉండటం ప్రయత్నించాలా? అంటే – ఉత్తరాలు వ్రాయడం లేదా ప్రత్యక్షంగా ఆయన సాన్నిధ్యంలో ఉండటం ఇలాంటివి. వాటితో ప్రాథమికంగా ఏదైనా ఉపయోగం ఉందా? సద్గురువు దృష్టిలో పడటానికి మేము బాహ్యంగా చేసే పనులవల్ల ఎంత ప్రయోజనం ఉంటుంది? లేక కేవలం కర్మసంబంధం ఉంటే సరిపోతుందా?

గురువుగారు:

కొంతమంది సద్గురువులు మనకి మంత్రాన్ని ఉపదేశించి, కొన్ని సాధనలు చేయమని చెప్పి అనుగ్రహిస్తారు. కొంతమంది సద్గురువులు కేవలం వారి చూపు ద్వారా అనుగ్రహిస్తారు. రమణమహర్షి తమ భక్తులకు అనుభవాలు ఎలా ఇచ్చేవారో చూడండి. ఆయన అలా కూర్చొని ఎవరివంకైనా చూస్తే ఆ చూపు ద్వారా ఆ వ్యక్తికి అనుభవాలు వచ్చేవి. మరికొంతమంది కేవలం ఆలోచన ద్వారా ఆ అనుభవాన్ని ఇవ్వగలరు. బాబా తాబేలును ఉదాహరణగా చెప్పారు. తాబేలు తన దృష్టి ద్వారా పిల్లలను సంరక్షిస్తుంది. "నా గురువు తాబేలువంటివారు, ఆయన ఆలోచనే నన్ను రక్షిస్తూ పోషిస్తుంది. ఆయన నన్ను అలా అనుగ్రహించారు" అన్నారు బాబా. ఇప్పుడు మనకు బాబాలాంటి సద్గురువు లభించారు. మీరు ఆయన గురించి ఆలోచిస్తున్నంతవరకు ఆయన మీ గురించి ఆలోచిస్తూ ఉంటారు. ఆయన గురించిన ఆలోచనే మనకు చాలు. మీరు ఎక్కడున్నప్పటికీ మీరు ఆయన మీద దృష్టిపెట్టి ఉన్నంతవరకు మీరు ఆయన చేతిలో ఉన్నట్లే.

భక్తుడు:

ఆలోచన? మన ఆలోచనే సరిపోతుందా గురువుగారూ? మన ఆలోచన, మన స్మరణ సరిపోతుందా?

గురువుగారు:

అవును, మీ స్మరణ. నేను మీకు అదే చెబుతూ వస్తున్నాను. "మీరు నా గురించి ఆలోచించండి, నేను మీ గురించి ఆలోచిస్తాను". అంతేగానీ, మీరు ఆరు అడుగుల దూరంలో ఉండి నా గురించి ఆలోచిస్తేనే, నేను మీ గురించి ఆలోచిస్తాను, నా ట్రాన్స్‌మీటర్ శక్తి కేవలం ఆరు అడుగులు మాత్రమే, లేకపోతే అక్కడ సిగ్నల్ ఉండదని కాదు. అలాంటిదేమీ లేదు.

భక్తుడు:

గురువుగారూ! మీరు అంతకుముందు వికసనం గురించి మాట్లాడుతున్నప్పుడు, ఆ ప్రక్రియలో వికసితమయ్యేదంతా పువ్వులో నుండి అంటే శిష్యునిలో నుండే వస్తుంది అని చెప్పినట్లనిపించింది. మరి గురువు శిష్యునికి చేసేది, శిష్యుని కోసం చేసేది ఏమీ లేదా? నేను అనుగ్రహాన్ని ప్రసరిస్తారనుకుంటున్నాను.

గురువుగారు:

తనకు తానుగా ఏదీ వికసితం కాదు. ఉదాహరణకు విత్తనాన్ని తీసుకోండి, విత్తనానికి మొలకెత్తి మహావృక్షమయ్యే సామర్థ్యం (potential) అంతర్గతంగా ఉంది. దానినే అంతర్గత సామర్థ్యం అంటారు. మీకూ ఆ శక్తి ఉంది. కానీ మీరు ఆ విత్తనాన్ని ఎక్కడో పడేస్తే అది మొలకెత్తదు, ఎందుకంటే మొలకెత్తడానికి కొన్ని అవసరం అవుతాయి. దానిని విత్తాలి, నీరు, పురుగు మందులు, ఎరువులు, కంచె, పోషణ ఇలా ఎన్నో కావాలి. దానికి సంరక్షణ కావాలి. ఒక విత్తనం విడివడి మొలకెత్తాలంటే ఎన్నో కావాలి. వీటిలో ఏది లోపించినా అది మొలకెత్తదు. గురువు ఇటువంటి వాటినన్నింటినీ ఇస్తారు, ఆయన పోషణనిస్తారు, రక్షణనిస్తారు. వాటివల్లే అది మొలకెత్తడం జరుగుతుంది.

హృదయ వికాసం

ప్రతి ఒక్కరిలో ఆ అంతర్గతమైన సామర్థ్యం ఉంది. ఎవరైతే దానిని జాగృతం చేసి, అది పెరిగి మహావృక్షం కావడానికి అవసరమైన వాతావరణాన్ని ఏర్పరుస్తారో వారే సద్గురువు. అప్పుడది పరిపూర్ణత్వాన్ని పొందుతుంది.

కాబట్టి వికాసం కలిగేది శిష్యునికే అయినప్పటికీ, దానిని సాధ్యపడేలా చేసేది గురువే. ఒక మొగ్గను వికసించేలా చేయడమంటే బలవంతంగా దాని రెక్కలు విడదీయడం కాదు. దానిని వికసించడం అనరు. అలా చేయడం వలన ఆ మొగ్గ పువ్వుగా మారదు. సద్గురువు మొగ్గ వికసించేందుకు అవసరమైన వాటిని ఇచ్చి అది వికసించేటట్లు చేస్తారు. అప్పుడే వికసించడం, పుష్పించడం అనే ప్రక్రియ ఆనందంగా, సంతోషంగా ఆస్వాదించే అనుభవమవుతుంది.

గురువు శిష్యుని మనస్సును, వాతావరణాన్ని తగువిధంగా సిద్ధంచేస్తారు. అప్పుడు వికసించడం అనేది శిష్యుని అనుభవమవుతుంది. శిష్యునికి అది గురువు ప్రసాదించినట్లే ఉంటుంది. కానీ అది ఎవరూ ఎవరికీ ఇచ్చేది కాదు. అది మీరు చీకటి గదిలో ఉన్నప్పుడు లైటు వేయడంలాగా ఉంటుంది. నేను లైటు వేసి మీరు చూసేలా చేసినప్పటికీ చూసేది మాత్రం మీరే. ఆ లైటు కేవలం మీరు చూడగలిగేలా చేసింది. గురువు మిమ్మల్ని చూసేలాగా చేస్తారు. ఆయన మిమ్మల్ని సిద్ధం చేస్తారు. చూడటానికి కావలసిన శక్తినిస్తారు.

# మన కోరికలు తీర్చడం

గురువుగారు:

సాయిబాబా వంటి సద్గురువు కేవలం ఆధ్యాత్మికమైన అవసరాలు మాత్రమే కాదు, ప్రాపంచికమైన అవసరాలు కూడా తీరుస్తారు. ఎక్కువమంది ప్రాపంచికమైన విషయాల వలనే ఇబ్బందిపడుతూ వాటి కోసమే పరితపిస్తుంటారు. యోగి వేమన ఒక పద్యంలో, "ఎవరైతే ఇహాన్ని మాయ అని, ప్రపంచాన్ని విడిచిపెట్టి, ఆ పరమైన దానిని పొందడానికి ప్రయత్నించమంటాడో వాడు దొంగ, వాడు వట్టి అబద్ధాలు చెబుతున్నాడు" అంటారు.

లౌకికమైన విషయాలకు ఆవల యీ ప్రాపంచిక జీవితానికి అతీతంగా ఉండేది – అదేమిటో మనకు తెలియదు – దానిని సద్గురువు మనకు ఇక్కడ ఇవ్వగలగాలి. మనం అక్కడికి వెళ్ళలేము, ఆయనే ఇక్కడికి దిగిరావాలి. ఒకవేళ ఆయన వీటన్నింటికీ అతీతంగా ఉంటే ఆయన మన కోసం ఇక్కడికి దిగి రావాలి. ఒకవేళ మనమే గనుక అక్కడికి వెళ్ళవలసి ఉంటే, ఆయన మన చెయ్యి పట్టుకుని నడిపించుకుంటూ అక్కడికి తీసుకువెళ్ళగలగాలి. ఈ పని చెయ్యగలిగినవారే సద్గురువు.

ఒక వ్యక్తి వచ్చి, నాకు ఆరోగ్యం సరిగాలేదు, నేను ఫలానా వ్యాధితో బాధపడుతున్నాను, నాకు చాలా ఆందోళనగా ఉంది, నాకు మీ సహాయం కావాలి అన్నాడనుకోండి. సద్గురువు ఆ సహాయం చెయ్యగలగాలి. ఒకవేళ ఎవరైనా నాకు ఉద్యోగంలేదు, నాకు మంచి ఉద్యోగం కావాలి అంటే అతనికి ఉద్యోగం ఇవ్వగలగాలి.

ఇంకొకరొచ్చి నేను ప్రేమలో విఫలమయ్యాను, నేను నా ప్రియుడితో లేక ప్రియురాలితో తిరిగి ఒక్కటవ్వాలి అంటారు, వారికి దానిని ఇవ్వగలగాలి. వాళ్ళు ఆ స్థితిలో ఉన్నారు. ప్రేమలో విఫలమై, ఆ బాధవల్ల, ఆలోచనల వల్ల మనస్తాపానికి గురైన వ్యక్తికి... "ఇదంతా మాయ, అందమనేది కేవలం చర్మానికి మాత్రమే సంబంధించినది, నిర్వాణం గురించి మాత్రమే ఆలోచించు!"... ఇలా మాట్లాడితే అది కేవలం మెట్టవేదాంతం కాదా? "ఆరోగ్యం ఇతరత్రా ప్రాపంచికమైన విషయాలు నాకు సంబంధించిన అంశాలు కాదు, నువ్వు ఆత్మజ్ఞానం, నిర్వాణం, ముక్తి గురించి అడిగితే వాటిని సాధించడం ఎలాగో నేను మీకు చెప్తాను. వీటన్నింటినీ వదలిపెట్టి నా వద్దకు రండి, వీలైతే మీ ప్రాపంచిక విషయాలను (ఆస్తిపాస్తులను) నాకు వదలిపెట్టి తరువాత నా వద్దకు రండి. వాటిని ఎక్కడో వదలివేయవద్దు, నాకు ఇవ్వండి. అప్పుడు నేను మీకు ఆత్మజ్ఞానం గురించి బోధిస్తాను"... ఇలా అంటుంటారు ఇంకొందరు.

బాబా అలాంటి గురువుకాదు. ఆయన క్రింది నుండి పైవరకు అందరి అవసరాలు తీరుస్తారు. ఆయన కేవలం అ, ఆలు మాత్రమే కాదు, ఉన్నతవిద్య వరకు అన్ని స్థాయిలవారికీ బోధించగలరు. ఆయన మనల్ని ఒక్కో మెట్టు ఎక్కించి క్రింద నుండి తీసుకువెళతారు. ఆయన చెప్పింది కూడా అదే. "నా భక్తులు అడిగినవన్నీ ఇస్తాను, నేను ఇవ్వదలచింది వారు అడిగేంతవరకు" అని.

## అద్భుత మహిమలు ఆత్మసాక్షాత్కారం

గురువుగారు:

జ్ఞాని మనస్సు కోరికలు తీర్చే చింతామణివంటిదని భగవాన్ చెప్పారు. మనం వారి వద్దకు వెళ్ళి విశ్వాసంతో మన ఇబ్బందులు చెప్పుకుంటే అవి ఆయన మనస్సును తాకిన క్షణం నుండి మన ఇబ్బందులు తొలగిపోవడం ప్రారంభమవుతుంది. దీనికి కారణం ఆయన యావత్తు చైతన్యంతో, అన్ని ప్రాణులతో తాదాత్మ్యం చెందివుంటారు. ఆ చైతన్యమే విశ్వమంతా వ్యాపించి ఉంది. ఆయన సంకల్పం విశ్వవ్యాప్తమైన మనస్సును తాకిన తక్షణం మీ ఇబ్బందులు తీరే విధంగా విశ్వంలో మార్పులు జరిగేలా ఆయన చేస్తారు. వాటినే అందరూ అద్భుతాలు (మహిమలు) అంటారు. అద్భుతం (మహిమ) జరిగితే అది చుట్టుప్రక్కల పరిస్థితులలో నుండి జరగాలి. అంతేగానీ అదో విన్యాసంలాగా ఉండకూడదు. ఆ మహిమ సాధకునికి ఆ మహాత్ముని పట్ల, జ్ఞాని పట్ల విశ్వాసాన్ని కలిగించాలి. ఆ అద్భుతం (మహిమ) ఆ మహాత్ముని నిజతత్వాన్ని, సమస్త ప్రపంచంతో ఆయన ఒక్కటై ఉన్నారన్న సత్యాన్ని స్పష్టం చేస్తుంది. ఆత్మసాక్షాత్కారం యొక్క లక్ష్యమదే. ఆ మహిమ ఎల్లప్పుడూ ప్రబోధాత్మకంగా ఉండాలి. ఉన్నదంతా ఒకే చైతన్యమనే సత్యాన్ని తెలుసుకునేలా చేయాలి. బాబా చేసిన మహిమలన్నీ కేవలం ఆశ్చర్యానికి గురిచేసే విన్యాసాలు కాదు, అవి ఒక ప్రత్యేకమైన విషయాన్ని ప్రబోధిస్తాయి.

భక్తుడు:

కానీ బాబాకు జరగబోయే విషయాలు తెలుసుననిపిస్తుంది.

గురువుగారు:

ఆయనకెలా తెలుసు? ఆయన సమస్త విశ్వంతో మమేకమై ఉన్నందువలన తెలుస్తుంది. బాబాకు మన భవిష్యత్తు తెలుసు అనే విషయం మనకు తెలిస్తే, మనం సంతోషంగా మన జీవితాన్ని ఆయన చేతుల్లో పెట్టగలం. ఈ అద్భుతాలు (మహిమలు) మనల్ని ఉత్తమమైన, సులువైన పద్ధతితో సద్గురువుకు శరణాగతి పొందేలా చేస్తాయి, అది ఆత్మసాక్షాత్కారానికి దారితీస్తుంది. మనల్ని మనం సద్గురువుకు శరణాగతిపథంలోనికి నెట్టుకోలేము. "మీ మనస్సును నాకప్పగించండి, నేను దానిని నాశనం చేస్తాను" అన్నారు భగవాన్. కానీ మనం మనస్సును భగవాన్‌కి అర్పించలేము. మనకు పూర్తి విశ్వాసం లేకుండా మనం ఆ పని ఎందుకు చేస్తాము? మనం ఇష్టపడి మనోనాశనం చేయడానికి ఎందుకు అంగీకరిస్తాము? ఈ మహిమలు మన మనస్సును ఆయనకు శరణాగతి చెందేలా చేసి మనోనాశానికి సిద్ధం చేస్తాయి. మహిమ జరిగిన ప్రతిసారీ మన మనస్సు మీద ఘాతం పడుతుంది, మనస్సు అణుగుతుంది. "ఎంత అద్భుతమైన అనుభవం. అది నన్ను ఘాతంలా తాకింది" అంటారు. అప్పుడు మీకు మరింత విశ్వాసం కలుగుతుంది. ఆ విశ్వాసం ఆధారంగా మీరు ఇంకా ఇంకా శరణాగతి చెందుతారు, ఈ శరణాగతి వల్ల మీరు సద్గురువులాగా సమస్త విశ్వంతో ఒక్కటవుతారు. మనల్నందరినీ తమలాగా తయారుచేయాలని బాబా అనుకుంటున్నారు. భగవాన్ కూడా అదేవిధంగా అందరినీ ఆయనలాగా చేయాలనుకున్నారు. అందుకే వాళ్ళు మహిమలు చేస్తారు.

భక్తుడు:

వారు పొందిన స్థితికి యీ మహిమలు సహజసిద్ధమైన పర్యవసానాలా?

గురువుగారు:

అవును. వారు అందరిలోనూ తమ ఆత్మనే అంతటా దర్శిస్తారు. అది తమను తామే సృజించుకునే విధం, తమను తాము పరిపూర్ణం చేసుకునే విధానం. వారికది అలా ఉంటుంది. కానీ మన ఆలోచనలు భిన్నంగా ఉంటాయి. ఎందుకంటే మనం వారితోను, మిగతా ప్రాణులతోనూ ఒక్కటిగా ఉన్నామనే విషయం మనకు తెలియదు. అందుకని మనల్ని తమలా చేయడానికి వారు ప్రయత్నిస్తున్నారు.

బాబా రూపంలో ఏ సూత్రమైతే పనిచేస్తుందో, మిగతా రూపాలలోనూ అదే సూత్రం పనిచేస్తుంది. "ఎన్నో రూపాలలో నేనూ ఒకడిని, కర్మానుసారం ఎవరితో నాకు సంబంధం ఉందో వారి అవసరాలు నేను తీరుస్తాను" అనేవారు బాబా.

ఉదాహరణకు మన శరీరంలో ఒక కణానికి ఇబ్బంది కలిగిందనుకోండి. దురదగా ఉందనుకుందాం – దానికి సాయం కావాలి. శరీరంలోని మరో కణం దాని అవసరాన్ని తీరుస్తుంది. మరో దానికి మరో అవసరం కలిగితే, శరీరంలోని మరో భాగం దాని అవసరం తీరుస్తుంది. కోట్లాదిమందికి కేవలం సాయిబాబా ఒక్కడే అన్నీ అవసరాలు తీరుస్తున్నాడని కాదు. సాయిబాబా ద్వారా ఏ సూత్రమైతే పనిచేస్తుందో ఆ సూత్రమే అందరి అవసరాలు తీరుస్తుంది.

శరీరంలోని కోట్ల కణాలతో నువ్వు ఎలా ఒక్కటి కాగలుగుతున్నావు? మీ శరీరం కోటానుకోట్ల సజీవకణాల సముదాయం. దానినంతా కలిపి 'నేను' అంటావు. మీ శరీరంలోని కణాలన్నింటితో మీరు ఒక్కటి కాగలిగినప్పుడు సద్గురువు సమస్త ప్రాణులతో ఒక్కటి ఎందుకు కాలేడు? ఆయనకు సమస్త

ప్రపంచం తన శరీరమే. మీరు మీ శరీరంలోని కోట్లాది కణాలతో ఒక్కటి ఎలా కాగలిగారో చెబితే, సద్గురువు కోట్లాదిమందితో ఎలా ఒక్కటి కాగలుగుతారో నేను చెబుతాను.

భక్తుడు:

ఈ కోట్లాది కణాలకు వివిధరకాలైన అవసరాలు ఉండవు కదా?

గురువుగారు:

ఎందుకుండవు? వాటికి రకరకాల అవసరాలు ఉంటాయి. అందుకే మీరు ఆహారం తీసుకుంటారు, విశ్రాంతి తీసుకుంటారు. మీరు ఇలా కూర్చుంటారు, అలా కూర్చుంటారు. మీరు కూర్చొనే తీరును ఎందుకు మార్చుకుంటారు? ఎందుకంటే యీ ప్రక్క నుండే కణాలు, “నొప్పి పుడుతోంది, అలా తిరిగి కూర్చో” అని చెబుతాయి. అప్పుడు మీరు అలా కూర్చుంటారు. మీరు యీ అవసరాలన్నీ తీరుస్తున్నారు. అలాగే శరీరంలోని వివిధ కణాల యొక్క అవసరాలు తీరుస్తున్నారు. కాసేపటికి ఒక దోమ వచ్చి మిమ్మల్ని కుడుతుంది. అప్పుడు ఆ కణం, “ఇప్పుడు నాకు ఇబ్బందిగా ఉంది, ఇక్కడ గీరు” అంటుంది. అప్పుడు మీరు అక్కడ గీరుతారు. మీరు ఇలా రకరకాల అవసరాలు తీరుస్తున్నారు.

# నిజమైన మనిషి

భక్తుడు:

సద్గురువుకు సమస్త ప్రపంచం తమ శరీరమే అయినప్పుడు అందులో సర్వప్రాణులూ భాగమై ఉండాలికదా. పశుపక్ష్యాదులు సైతం సద్గురు సహాయాన్ని అనుభూతి చెందుతాయా?

గురువుగారు:

మనిషి అంటే ఏమిటి? ఒక మనిషిని ఎలా నిర్వచిస్తారు? అతను ఎలా ఆలోచిస్తాడు అనేదాన్ని బట్టి మనిషి అంటారా? లేక పుట్టుకను బట్టి మనిషి అంటారా? అతను కేవలం ఒక జీవజాతి – మనిషి అనే జీవజాతి కాబట్టి మనిషి అంటారా? లేదా ఒక మనిషిని ఇతను మనిషి అని నిర్వచించేది ఏదైనా ఉందా? ఒక మనిషి మనిషిగా ఉండాలంటే ఎలా ఉండాలి? మనిషిని మనిషిగా చేసేది ఏమిటి?

భక్తుడు:

మనుషుల మధ్యగల అనుబంధమా?

గురువుగారు:

చీమలు, కుక్కలు, ఎలుకలు, పక్షుల మధ్య కూడా అనుబంధముంటుంది. నిజానికి వాటి మధ్యే గొప్ప అనుబంధం ఉంటుంది. కొద్దిరోజుల క్రిందట ఓ వలసపక్షి సాయంత్రం నా గదిలోకి వచ్చి సరిగ్గా నా కంప్యూటర్ కీబోర్డు మీద వాలింది. అప్పుడక్కడంతా చీకటిగా ఉంది. ఆ పక్షి వచ్చి కీబోర్డు మీద వాలడంతో స్క్రీన్ హఠాత్తుగా ఆన్ అయింది. ఆ పక్షి కొన్ని

గంటలపాటు అక్కడే ఉంది. దానిని మేము మేడ మీదకు తీసుకెళ్తే అది కాస్త నీళ్ళు త్రాగి ఎగరసాగింది. అదలా ఎగరడం మొదలుపెట్టిన తరువాత మేము చాలా ఎత్తులో వలయంగా తిరుగుతున్న ఒక పక్షుల గుంపును గమనించాము. ఆ రెండు, మూడు గంటలపాటు అవి తప్పిపోయిన పక్షి కోసం ఎదురుచూస్తున్నాయి. ఆ పక్షి రాగానే దానితో కలసి అన్నీ వెళ్ళిపోయాయి. ఆ పక్షి ఎంతోసేపు నా గదిలో ఉంది, అది వాటికి కనిపించడం కూడా లేదు. కానీ అవి ఎదురుచూస్తున్నాయి! ఆ అనుబంధం చూడండి!

అక్కడ నాకు కనిపించింది మానవత్వం, మనిషి లక్షణం. సద్గురువులో యీ మానవత్వానికే మనం అత్యంత విలువనిస్తాం. ఆ పక్షుల దగ్గర నేను ఆ లక్షణాన్నే చూశాను. ఎవరైనా ఎవరికైనా చేయూతనివ్వడానికి ఎదురుచూస్తూ ఉండటం. అక్కడ ఆ పక్షులు ఎదురుచూస్తున్నట్లు బాబా మన కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదు. కానీ ఆయన మన కోసం ఎదురుచూస్తుంటారు. మనకు చేయూతనివ్వడానికి ఆయన వేచివుంటారు. మనం వైకల్యం ఉన్న ఆ పక్షిలాంటివాళ్ళం. ఆ పక్షుల గుంపు సద్గురువు. నేను ఇక్కడ సద్గురువు అనే సూత్రాన్ని చూస్తాను. ఊరికే రెండుగంటలు అలా ఆకాశంలో ఎగురుతూ ఉండటం ఎంత కష్టమో ఆలోచించండి!

బుద్ధుని మహానిర్వాణం గురించి కూడా ఇదే సాదృశ్యాన్ని చెప్తారు. ఆయనకు జ్ఞానం సిద్ధించినప్పటికీ ఆయన వేచివుంటారు. మానవజాతిలో చివరి మనిషికి జ్ఞానోదయం అయ్యేవరకు ఆయన ఎదురుచూస్తూనే ఉంటారు.
ఈ సందర్భంలో బుద్ధుడు ఆ పక్షులగుంపులాంటివారు.

# గురువు యొక్క మహాత్మ్యం

గురువుగారు:

ఏ కారణమూ లేకుండా మీకు ఆనందాన్నిచ్చేదే ఆధ్యాత్మికానుభవం. సద్గురువును కలుసుకున్నప్పుడు ఇదే జరుగుతుంది. మీకు ఆనందం కలగడానికి కారణమేదీ ఉండదు. అయినా మీరు ఆయన పట్ల అంతగా ఎందుకు ఆకర్షితులవుతున్నారు? ఆయన వద్ద మీరు ఆనందాన్ని, భద్రతాభావాన్ని ఎందుకు పొందుతున్నారు? దానికి కారణమేమీ ఉండదు. ఆయన ఆకర్షణీయమైన రూపమా, ఆయన జ్ఞానమా, ఆయన వాక్పటిమా? ఏంటి దానికి కారణం? లేక ఆ ప్రదేశమా? అవేమీ కాదు. మీరు అంతకంటే మంచి ప్రదేశాలనే చూసివుంటారు. ఎవరైనా మిమ్మల్ని "ఎందుకు?" అని ప్రశ్నిస్తే మాత్రం మన దగ్గర సమాధానం ఉండదు. ఒకవేళ మీరు ఆ "ఎందుకు" అనే ప్రశ్నకు సమాధానం చెబితే మీ అనుభవాన్నే నేను శంకిస్తాను! కొంతమంది, "ఇదిగో, ఈ కారణం వలన నేను ఇక్కడ ఉన్నాను" అనవచ్చు. నిజమే, మనస్సు హేతుబద్ధంగా సమాధానం చెప్పడానికి ప్రయత్నిస్తుంది. ఎంతైనా మనం హేతుబద్ధమైన జీవులం కదా. కానీ వాస్తవానికి, నిజాయితీగా చెప్పాలంటే, మనకు తెలియదు.

అక్కడ మనల్ని మనం చాలా అల్పులం అని అనుకునేలా చేసేది ఏదో ఉంది. కానీ ఆ అల్పత్వం మనల్ని భయపెట్టదు. ఇంకా చెప్పాలంటే అందులో భద్రతాభావం ఉంటుంది. అందులో ఓ రమణీయత ఉంది. సాధారణంగా మన అల్పత్వం మనకు తెలుస్తున్నదంటే మనం భయపడుతున్నామని అర్థం.

“అయ్యో, మనం అల్పులమైపోతున్నాం” ఇలా అనిపించడం మనకు చిన్నతనంగా ఉండాలి. కానీ సద్గురువు దగ్గర మనం తక్కువ అనే అనుభవం ఉండదు. మనస్సుపై ఉన్న భారమేదో తగ్గిపోయినట్లయ్యి మనకు ఆనందం కలుగుతుంది. మీకు ఇలాంటి అనుభవాన్ని ఇచ్చేది – అది ఏదైనా సరే... అదే గురువు, సద్గురువు. ‘గురు’ అంటే పెద్దది, చాలా పెద్దది అని అర్థం. ‘ఎంత పెద్ద?’ ‘చాలా పెద్ద’. అదీ ఆ పదానికి ఉండే అర్థం. సంస్కృతంలో దానికి ‘పెద్ద’, ‘శక్తివంతమైన’, ‘గొప్ప’ అనే అర్థాలున్నాయి. ఎంత గొప్పదంటే ఆ గొప్పతనం ముందు మనం చాలా అల్పులం అనిపిస్తుంది. కానీ ఆ గొప్పతనం మనల్ని తక్కువ చేయదు, భయపెట్టదు, అభద్రతాభావాన్ని కలిగించదు. మనలో మరింత భద్రతాభావాన్ని కలిగించి ఆనందంగా ఉండేటట్లు చేస్తుంది. మనల్ని దాదాపుగా ఆనందపారవశ్యంలోనికి, ఓ రమణీయమైన అనుభూతిలోనికి తీసుకెళుతుంది. మీ అల్పత్వం మీకు ఇలాంటి అనుభూతిని కలిగించాలి. మీకు ఇలాంటి అనుభవం కలిగేలా చేసేవారు మీ సద్గురువు. మీరు ‘గురువు’ అనే పదానికి వేయి అర్థాలు వినివుండవచ్చు. కానీ జరిగేది ఇది. మీకు ఇలాంటి అనుభవం ఎక్కడ కలుగుతుందో అది మీ గురుస్థానం. మీరు హిమాలయాలను చూసినప్పుడు పరోక్షంగా జరిగేది కూడా ఇదే.

భక్తుడు:

అవి చాలా మహోన్నతమైనవి. వాటిని చూస్తే చాలా గొప్ప గౌరవభావం ఉంటుంది. కానీ అక్కడుండే మహత్తరశక్తి వల్ల అవి ఒకరమైన భయాన్ని కూడా కలిగిస్తాయి.

గురువుగారు:

అంత గొప్ప పర్వతాలను చూసినపుడు మొదట మీరు భయపడవచ్చు. నిజానికి అక్కడ మీరు భయపడాలి కానీ మీకు భయం వేయదు. అలా చూడటం మీకు పరవశాన్ని కలిగిస్తుంది. మీరు వాటిని చూసేకొద్దీ ఆనందం పెరుగుతూ ఉంటుంది. అది చాలా గొప్పగా ఉంటుంది.

ఆ తరువాత ఆ భయమే ఒక రకమైన సాహసాన్ని కలిగిస్తుంది. ఉదాహరణకు నేను వైట్ వాటర్ రాఫ్టింగ్‌కు వెళ్ళాలనుకున్నాను. ముందు నాకు భయంగా ఉంటుంది. కానీ నెమ్మదిగా, ఇతరులు రాఫ్టింగ్ చేయడం చూసి, బహుశా అది అంతగా భయపడాల్సింది కాదేమో అనిపిస్తుంది. తరువాత మొదటి స్థాయిని పూర్తి చేస్తాను, “నేను ఎంతో కంగారుపడ్డాను, కానీ నాకేం కాలేదు కదా” అనిపిస్తుంది. ఆ పై రెండవస్థాయికి వెళతాను, తరువాత మూడవస్థాయి. భయం ఉంటుంది. ప్రతి స్థాయిలోనూ భయం ఉంటుంది కానీ మనం దానిని – ఆ ఉద్విగ్నతను, ఆ థ్రిల్‌ను ఆస్వాదించడం మొదలుపెడతాము. అది ఉత్కంఠభరితంగా మారుతుంది. అది ఉల్లాసంగా మారుతుంది. భయం ఉండదని కాదు. అంతకు పూర్వం జరిగిన సాహసాలన్నీ (అడ్వెంచర్‌లు) భయం లేకుండానే జరిగాయి అనుకుంటున్నారా? మనకు భయం లేకపోతే మనం ఆ సాహసాన్ని (అడ్వెంచర్‌ను) ఆస్వాదించలేము. అలాకాని దానిని అడ్వెంచర్ అని ఎందుకంటామసలు? మనం ముందుకెళ్ళి ప్రయత్నించింది ఎక్కడ? భయం ఉంటుంది. కానీ అది మరో రూపంలో అనుభవమవుతుంది.

మనం హిమాలయాలలో ప్రయాణిస్తున్నప్పుడు, మనం విశాలమైన, ఉన్నతమైన పర్వతాలను చూశాము. మనం వాటిని చూసిన తక్షణం,

మనం చాలా అల్పులం అనిపించింది. అవి చాలా పెద్దవి – మన ఊహకు సైతం అందనంత పెద్దవి, మహోన్నతమైనవి. ఆ ఉన్నతత్వం ముందు మనం చాలా అల్పులమనిపించింది.

మరే ఇతర సందర్భంలోనైనా యీ చిన్నతనం మనకు బాధను, విచారాన్ని కలిగిస్తుంది. ఎందుకంటే మనం అల్పులమైనట్లు చిన్నతనమనిపిస్తుంది. అది ఎవరికి జరిగినా బాధ కలుగుతుంది, మనస్తాపం కలుగుతుంది. కానీ ఇక్కడ మీరు ఆనందానుభూతిని పొందుతారు. ఆ అల్పత్వభావన ఎంత గాఢంగా ఉంటుందంటే 'నేను' అనేది మాయమైపోయి మీరు ఆ మహోన్నత్వంతో ఒక్కటవుతారు. ఆ 'నేను' లేని స్థితిలో సంతోషంగా కలసిపోతారు. మీరు సముద్రం ముందు లేదా హిమాలయాల ముందు నిలబడినపుడు లేదా రాత్రిపూట ఆకాశాన్ని చూసినపుడు ఇలాంటి అనుభూతినే పొందుతారు.

మీరు ఆ మహోన్నత్వాన్ని చూస్తారు. అది మిమ్మల్ని అల్పులను చేస్తుంది. మిమ్మల్ని ఆనందపరుస్తుంది. అసలు అక్కడ ఏం జరుగుతోంది? ఆ మహోన్నత్వం మీకు సంతోషంతో కూడిన అల్పత్వాన్ని కలుగజేస్తుంది. ఎంత అల్పంగా అంటే మీరు అనేవారు లేకుండా పోతారు. దాని వెనుక జరిగే ప్రక్రియ ఇదే. దానికి, మీకూ ఉండే అనుబంధం అలా ఉంటుంది. గురువుకి, శిష్యునికీ మధ్య ఉండే అనుబంధం అది. దానిని మార్మికం చేయడానికి ప్రయత్నించవద్దు. సరిగ్గా ఇదే జరుగుతుంది. మన రోజూవారీ జీవితంలో మనం దీనిని అనుభూతి చెందుతూనే ఉంటాం. దీనినే శాస్త్రాలు, మహాత్ములు 'గురువు' అన్నారు.

ఆ పర్వతాలు మీ వద్దకు వచ్చి, మేము హిమాలయాలం, మేము చాలా ఉన్నతమైన పర్వతాలం, మీకు కనిపించడం లేదా అని అడగవు. అవి అలా అనవు.

ఒకవేళ అవి అంటే అవి హిమాలయాలే కాదు. అందుకే గురువు ఎప్పుడూ తనను తాను గురువునని చెప్పుకోడు. అది సాధ్యం కాదు. ఆయన అంత పెద్దవాడు కాబట్టి ఆయనకు అల్పత్వానికి, ఉన్నతత్వానికి మధ్య వ్యత్యాసం తెలియదు. దానిని మనం అనుభూతి చెందవలసిందే. అందుకే రమణులు ఎప్పుడూ "నేను గురువును" అని చెప్పలేదు. బాబా కూడా "నేను గురువును" అని చెప్పలేదు. వాళ్ళు హిమాలయాలంతటివారు. మనం వాళ్ళను ఎప్పుడు చూసినా "వాళ్ళు హిమాలయాలు (ఎంత గొప్పవాళ్ళు) కదా" అనిపిస్తుంది.

భక్తుడు:

గురువుగారూ, మరి ఆ పరిమాణాన్ని గుర్తించడం ఎలా?

గురువుగారు:

ఆ పరిమాణాన్ని మీరు గుర్తించలేరు. ఎందుకంటే అది అసాధ్యం. హిమాలయాల పరిమాణాన్ని ఎవరైనా గుర్తించగలరా? లేదు. వాటి గొప్పతనాన్ని, మహోన్నత్వాన్ని, విశాలత్వాన్ని, రమణీయతను కేవలం అనుభూతి చెందగలం, అంతే. అక్కడ మనకు కలిగేది రసానుభూతి. అది ఎంత పెద్దదనే కొలత సమస్య కాదు. మీరు హిమాలయాలను చూసినపుడు అవి ఎంత పెద్దవి అని ఆలోచించరు. ఉదాహరణకు మీరు ఒక బిల్డింగ్‌ను చూసినపుడు, వెంటనే మీకు ఎన్ని అంతస్తులు అనే ఆలోచన వస్తుంది... "అయిదు, ఆరు... ఓᐩ, ఏడు!". కానీ మీరు హిమాలయాలను చూసినపుడు అవి ఎంత పెద్దవి అనే విషయాన్నే అసలు పట్టించుకోరు. మనస్సు అలా ఆలోచించడం మానేస్తుంది. ఆ గొప్పతనాన్ని, అందాన్ని ఆస్వాదిస్తుంది.

సముద్రం ముందు నిలబడి, "ఇందులో ఎన్ని గాలన్ల నీళ్ళున్నాయి" అని ఆలోచిస్తాడా? లేదు. అక్కడ అపారమైన జలరాశి ఉంది. మనస్సు మీద

ముద్రించుకుపోయేది అదే. తరువాత మిగతా ఆలోచనలన్నీ ఆగిపోతాయి. అది మంచి రసానుభూతిని ఇస్తుంది. అది అప్పటికప్పుడు జరిగిపోతుంది. మీరు దానిని వర్ణించలేరు. మీరు ప్రయత్నం చేస్తే మీరు ఆ అనుభవాన్ని కోల్పోతారు.

మీరు హిమాలయాలను చూసినపుడు, లేదా ఆకాశాన్ని చూసినపుడు, అరుణాచలాన్ని చూసినపుడు, లేదా సాయిబాబా వంటి సద్గురువును చూసినపుడు ఏదో జరుగుతుంది. తొలుత మీ మనస్సు ఆ గొప్పదనం మీద, ఆయన మహోన్నత్వం పైన లగ్నమవుతుంది. మీరు ఆనందాశ్చర్యాలతో దానిని అనుభూతి చెందుతారు. వారి పాదాలను పట్టుకోవడానికే కాదు, ఆయన పాదాల క్రింద ధూళిగా మారడానికి కూడా మీకు అవమానంగా ఉండదు. అలా కావడం ఆనందంగా ఉంటుంది.

సంస్కృతంలో గురువు అంటే పెద్ద అని అర్థం. గురువు అంటే బోధించేవాడు అని కాదు. పెద్ద! ఆ గొప్పతనాన్ని, మహోన్నత్వాన్ని మీరు ఎక్కడ అనుభవించినా – అంటే ఎక్కడ మీరు ఆనందంగా అల్పులుగా మారుతారో, అదీ గురువంటే. మీరలా స్వల్పాతిస్వల్పమవడం మీకు దుఃఖాన్ని ఇవ్వదు. మీరు ఎక్కడ అలా అటువంటి అనుభూతిని పొందుతారో అదే మీకు గురువు యొక్క స్థానం. అదే మీ హిమాలయం! అదే మీ సముద్రం! అదే మీ ఆకాశం!

సాయిపథం, శిరిడీ
SAIPATHAM PUBLICATIONS
SHIRDI CHENNAI HYDERABAD